# ప్రార్థనలు ధ్యానములు

- సోదరి సుశీలాదేవి

( ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్టు)

జననం :
9.11.1905



నిర్యాణం :
14.11.1957

ప్రథమ ప్రచురణ 9.11.2016
సోదరి సుశీల 112వ పుట్టినరోజు
(శ్రీశాంతి ఆశ్రమ శతజయంతి ఉత్సవాలు
21.1.2017 సందర్భంగా)

ప్రతులు : 1000

సేకరణ : ఆశ్రమవాసులు (శాంతిపత్రిక నుండి)

ప్రకాశకులు
ద మిషన్ ఆఫ్ పీస్
**శ్రీ శాంతి ఆశ్రమము**
**తోటపల్లి కొండలు, వయా శంఖవరం–533 446**
తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 7382009962

సర్వహక్కులు ప్రకాశకులవి.
ముద్రణ :
**మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం, రాజమండ్రి.**

---

**కృతజ్ఞతాభివందనలు**

ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయం అందించిన **శ్రీ జల్లిపల్లి సుబ్రహ్మణ్యం (బాబూరావు),** ఏలూరు వారికి భగవంతుని ఆశీస్సులతోపాటు, పరమ పూజ్యశ్రీ ఓంకార్ స్వామి, పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ వారు అనుగ్రహించుగాక !

**–ఆశ్రమ యాజమాన్యం**

# సోదరి సుశీల గారి "ద మిస్టిక్ ప్రేయర్స్ అండ్ పోయమ్స్" అనే పుస్తకమునకు స్వామి ఓంకార్ వ్రాసిన ఉపోద్ఘాతము

సోదరి సుశీల (ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్ట్) శాంతి ఆశ్రమంలో గల ఉద్దీపమైన శాంతిమయమైన తోటలో నుండి ఎంతో ప్రేమతో సేకరించిన పరిమళాలు వెదజల్లే సుగంధభరిత పుష్పాలే ఈ దివ్య "ప్రార్థనలు – గేయాలు" అనే పుస్తకం.

సుశీలాదేవి సేకరించి సమర్పించే ఈ ఆధ్యాత్మిక పుష్పాలు కేవలం ఏదో పైపైన చదివి సరిపెట్టుకునేవి కానేకాదు. అవి మరింత శ్రమతో లోతుగా చదివి మంచి అవగాహనతో బాగా ఆకళింపు చేసుకొన్న పిదప అంతర్యామి గూర్చి తపించి, ఆ దివ్యానుభూతిని పొందడానికి ఉపకరిస్తాయి. వీటిలో చాలా వాటిని మన 'శాంతి' పత్రిక పాఠకులు చదివి మన్ననలు పొందినవే.

అనంతము, అగాధము అయిన సముద్రం వంటివి ఆమె గేయాలు. ఇక ఆమె ప్రార్థనలు వ్యక్తిని విశ్వాత్మతో అనుసంధానం చేయడానికి వేయబడిన వారధులు. ఆమె ఆవేదనలు ఆశీర్వాదము పొంది శాంతి సముద్రంలో లీనమగుటకు తపించే నీటిబుడగలు వంటివి. అక్కడ పరిమితమైన వ్యక్తి 'నేను' అను అల్పత్వము పూర్తిగా కోల్పోవును. ఇక ఆమె ధ్యానములు ఆత్మ చైతన్యాన్ని మేలుగొలిపి సర్వోన్నత శాంతి శిఖరములకు గొనిపోగలవు.

"సత్యాన్వేషి అయిన ఆత్మకు ఒక్కమాట చాలుకదా !" అన్నట్లు వీటిని ప్రచురించడం ద్వారా ఆధ్యాత్మిక సాధకునికి ముఖ్యంగా దివ్య సోపానమువైపు సాగే వానికి, ఇవి తప్పక ఉపకరించునని గాఢంగా నమ్ముతున్నాను.

దివ్య తేజస్సుతో ప్రకాశించే, తూర్పు–పడమర బేధం లేక, ఏకమైన ఆత్మని వసివాడని అందంతో పరిమళ భరితమైన ఈ పుష్పాలతో అలంకరించాలి. కానీ ఆమె శ్రీశాంతి ఆశ్రమానికి చేసిన నిశ్శబ్ద కృషికి, ప్రేమ పూర్వక సేవలకు, అనేక కార్యక్రమములలో ఎంతో దయతో మనకిచ్చిన సహకారానికి ఆమె మననుండి వీడ్కోలు తీసుకొను సందర్భముగా మొదటగా ఆమెకే ఈ హారాన్ని ప్రేమపూర్వకంగా కృతజ్ఞతతో సమర్పిస్తున్నాము.

సర్వజ్ఞుడు, దయామయుడు అయిన సర్వాంతర్యామి యొక్క దివ్యాశీస్సులు పొందిన మన సోదరి సుశీలాదేవికి, శాంతి, ఆరోగ్యం, దివ్య జీవనాన్ని ప్రసాదించి, జాతిమత బేధాలు లేకుండా భగవంతుని సంతానానికి నిస్వార్థమైన దయాపూర్వక సేవలు అందించునట్లు ఆ పరమాత్మ చేయుగాక. అనేకమంది స్నేహితులయొక్క శాంతి ఆశ్రమ భక్తులయొక్క కోరికపై ఈ పుస్తకంలో సోదరి సుశీలాదేవి ఫోటో ప్రచురించుట సంతోషముగా యున్నది.

ప్రియమైన పాఠకుడా మంచి ఉత్తేజభరితమైన ఈ హారాన్ని ధరించే అర్హతగల ఆత్మగా నీ జీవితాన్ని ఒక దివ్యానుభూతి పొందగల గానంగా చేసుకోగలవా ! ఇదే నీ స్వంత సహోదరుడైన ఓంకార్ చేయు ప్రార్థన. ఆంగ్లమూలం : **స్వామి ఓంకార్**

ఓంశ్రీ ఓంకారాయ నమః

# యోగః కర్మసుకౌశలం

**పరమపూజ్యశ్రీ ఓంకార్‌స్వామి వారు** శాంతి ఆశ్రమమును 1917వ సం॥లో ప్రార్థనలు, ధ్యానములు చేసుకొని శాంతిని పొందుటకు స్థాపించారు. **21-1-2016 నుండి 21-1-2017 వరకు శాంతి ఆశ్రమ శతాబ్ధి ఉత్సవాలు జరుపుకుంటున్నాము.** ఓంకారస్వామి యొక్క శాంతి సందేశములతో ప్రేరణపొంది విదేశాలనుండి ఎందరో సోదర, సోదరీమణులు, మాతృ మూర్తులు శాంతి ఆశ్రమసేవకు, శ్రేయస్సుకు, అభివృద్ధికి ఎంతగానో తోడ్పడిరి. అట్టివారిలో ప్రముఖ పాత్ర వహించినవారు సోదరి సుశీల. **ప్రార్థన, ధ్యానములతో నిష్కామకర్మచేస్తూ వారి జీవితమును అర్పణచేసిన మహా యోగిని సోదరి సుశీల (ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్టు, న్యూజెర్సీ).** వారు పొందిన ఆధ్యాత్మిక అనుభవాన్ని అనేక ఉపనిషత్తు ప్రార్థనలను, ధ్యానములను రాబోయే సాధకులకు అందించారు. ప్రార్థనలు, ధ్యానము ఎందుకు అవసరం అంటే శాంతిని పొందడానికి. ప్రతిజీవి శాంతిని, ఆనందాన్ని పొందడానికి అన్వేషిస్తుంది. వాటిని ధ్యానము ద్వారా పొంద గలము. ఎలా ధ్యానించాలి అంటే, **'బ్రహ్మ తజ్జలానితి శాంత ఉపాసీత' అంటోంది చాంద్యోగ ఉపనిషత్తు. అంటే ప్రశాంత చిత్తంతో పరమాత్మను ధ్యానించాలి అంటోంది.** మనస్సు పవిత్రంగా, నిర్మలంగా ఉండాలి అంటే ప్రార్థన అత్యవసరము.

ప్రతి దినం ఇతరుల సంక్షేమం కోసం ప్రార్థించడం వలన మనస్సు పరమాత్మకు దగ్గరవుతుంది. మన ప్రార్థనాతరంగముల ద్వారా ధ్యాన స్థితి ఏకాగ్రత సంతరించుకుంటుంది. మనస్సు పవిత్రత చెందకుండా ధ్యాన సాధన తగిన ఫలితాన్ని ఇవ్వదు. కావున ధ్యాన స్థితి పొందడానికి తప్పని సరిగా ప్రార్థన అనేది అవసరం. నిష్కామకర్మ యోగం ద్వారా మనసు పవిత్రత చెందుతుంది. నిష్కామ కర్మయోగం అంటే ఫలితాన్ని ఆశించకుండా, 'యోగఃకర్మసుకౌశలం' మనం చేసే కర్మలను యోగభావనతో కుశలత్వంతో చేయుట. తన కర్మలను యోగంగా మార్చుకున్న సోదరి సుశీల దేశవిదేశాలలో శాంతి శాఖలకు ప్రార్థన, ధ్యానాదులను అందిస్తూ శాంతి ఆశ్రమ అభివృద్ధికి త్యాగ బుద్ధితో తనువు, మనస్సు, ధనం అర్పించిన తపస్విని. **వారు చేసిన సేవను స్మృతి యందు ఉంచుకొని ఆశ్రమ శతాబ్ధి ఉత్సవాల సందర్భంగా "ప్రార్థనలు-ధ్యానములు" అనే ఈ పుస్తకాన్ని (శాంతి అనే అమృత ఫలాన్ని) కానుకగా సమర్పిస్తున్నాం.**

గురుపాదసేవలో

20.9.2016 **స్వామిని వినమ్రానంద**

# ప్రార్థనలు

ఎవని పేరు సత్యమో, ఎవడు జగత్తునకు ప్రభువో, ఎవడు ఆనందమయుడై అంతులేని శాంతి ధామమునకు నిలయుడో అట్టి వానికి నా వందనములు.

దినములు గడచును, అబ్దములు గడచును యుగములు గడచును; పోనిమ్ము, వానిని గడచిపోనిమ్ము. మాకు నీ ప్రేమామృతమే నీ శాసనమే పరమావధి. అదియే మాకు సర్వస్వము. నేడు మేము అనంతమునందు లీనమైపోతిమి. సర్వకాలములయందును మా అహంకారమును పూర్ణముగా ప్రణవమునందు లయము చేయుదుము గాక !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

❊ ❊ ❊

ఓ దయామయా ! నా హృదయ కమలమును పాప భూయిష్టమైన యీ ప్రపంచమునుండి సమూలాగ్రముగా త్రుంచివైచి నందులకు నీ పవిత్ర నామమును వినయపూర్వకానందముతో స్తుతింతును.

ప్రభూ ! నీ ప్రశాంత శీతనిర్మల పర్వత సరోవరములలో నా హృదయ కమలమును నీ కోమల దయారస హస్తములతో నాటుము.

దేవా ! అమోఘమైన నీ మహిమను కొనియాడునట్లు నా హృదయకమలమును సర్వదా వికసింపజేయుము.

ఓం ఓం ఓం

❊ ❊ ❊

పెక్కు యుగములాదిగ జిజ్ఞాసాయుతమగు నా ఆత్మచే అనుసరింపబడుచున్న ప్రియమగు ప్రేమస్వరూపా ! నీ దివ్య తేజస్సుచే నింపబడిన కృష్ణభగవానునియొక్కయు, బుద్ధ దేవుని యొక్కయు, ఏసు ప్రభువు యొక్కయు అడుగులజాడను నీ పాద చిహ్నములను ఆనందముగా గాంచు చున్నాను. నిస్సారమును, కఠినమును అగు జీవితమునందు ప్రకాశవంతమగు నీ పాద చిహ్నములను ముద్దిడుచు ఆ అవతారపురుషులు ఏగినదారిని బోయి శాంతి సౌధమును జేచుటయందు నాకు తోడ్పడుము.

ఓం ఓం ఓం

❊ ❊ ❊

సీ. దేవా ! గురువరుండ నీవు నాకని విశ్వ
సించుచు నుంటి నీ శిష్యు నటుల
గైకొని దారిని గాన్పింపజేసి ప
విత్రు జేయు మితని వెలుగురాశిఁ
వ్యాపింప జేసి నీ బాటల జూపుము
చూడకూడని వానిఁ జూడకుండ
చేయదగని వాని జేయకుండెడి రీతి
వినరాని వానిని వినని పగిది

తే. నుడువ రానట్టి మాటల నుడువకుండ
ప్రేమభావన నన్ను వారింపు మయ్య
నిఖిల సౌభాగ్యములు నాకు నీవె యగుచు
వెలుఁగు చున్నావు సర్వదా విమల రూప !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

❊ ❊ ❊

తే. ఓయి నిర్వాణరూపా ! మహోన్నతాత్మ !
పరమపావన నామ ! ఓ భవ్య చరిత !
ప్రేమ గీతముల్ పాడు నా ప్రీతి పదమ !
సౌరభము వెదజల్లు పుష్పంబు వీవు !
అనవరతమును బ్రవహించు యమృత వాహి
నివి, నిఖిల మంగళములకు నిలయ మీవు !

**(శాంతి మే 1954)**

❊ ❊ ❊

సీ. సర్వేశ్వరుని దయాసంపద మనలను
స్థిరతర జ్ఞానుల జేయుగాక !
సత్య జీవనమును శాంతితో గడుపగ
మన మందర మొకటే మనసు గలిగి
సర్వదా సత్ప్రేమ సౌభాగ్య రాశితో
సంచరింతుము గాక ! క్ష్మాతలమున
పరమేశ్వరుడు పూర్ణ కరుణా ప్రకాశము
నిరతము మన మీ నెఱపు గాక !
తే. భువన పావన హేతువై పొంగునట్టి
వాని దివ్య తేజో ప్రభావంబు తఱచి
తెలియ లేకుండ భూతలిన్ దిరుగు మనకు
శ్రేయ మొనగూర్చి పూర్ణుల జేయుగాక !

**(శాంతి జూన్ 1954)**

❊ ❊ ❊

సీ. నీ నుండి వేరుగా నే నుండగా చేయు
వస్తువు లెంతటి ప్రాణదాయ
కంబులైనను ప్రీతి గమ్యంబులైనను
వానిని వేగమే వదలి వేసి
నీవలె వర్తింప నీ యాజ్ఞ తల దాల్ప
వాంఛించు చున్నాను వదర ! మఱియు
విషయ సంయుక్తమౌ విశ్వంబు కంటెను
నిశ్శబ్ద యుక్తమౌ నీదు వాణి
గీ. నెక్కువగ నెంచి మన్నింతు నేను సతము
నీదు బిడ్డకు మార్గంబు నెమ్మి జూపి
మహిమ నొప్పు సత్యంబులో మగ్నుజేసి
సతము రక్షించుచుండుమో శాంతి నిలయ

**(శాంతి జూలై 1954)**

* * *

సీ. అంతర్యమున బాహ్య మంచు వెలింగెడి
సదమలాత్మా ! నీదు సహజమైన
సత్ప్రేమ నెప్పుడు జ్ఞప్తియందుండంగ
సేయుము నా తను చేతనంబు
లందు నిలిచియుండి యఖిల కష్టంబుల
యాందోళనంబుల నణచి ప్రకృతి
విషయ దౌర్బల్యము వీడు నట్లుగ జేయు
సద్దయామయ దేవ శాంతిదాత
తే. నీ యనుగ్రహము వలన నిఖిల జనులు
దైవభావంబు మరువక ధాత్రి యందు
శాంతి సౌభాగ్యముల బొంది సంతసముగ
యలరుచుండగ జేయవే యనవరతము

**(శాంతి ఆగస్టు 1954)**

* * *

సీ. పెక్కు యుగములాది మిక్కిలి జిజ్ఞాస
తో నున్న నా యాత్మతో బెనగొను
ప్రేమ స్వరూప ! మత్ప్రీతినిలయ ! నీది
వ్య వెలుగుచే నింపబడిన కృష్ణ
దేవుని శ్రీ బుద్ధ దేవుని శ్రీ యేసు
సత్ప్రభు పదముల జాడలందు
నీ పాదచిహ్నముల్ నే నానందముగ వీ
క్షించుచుంటి, కఠిన జీవితమున
తే. కాంతివంతమౌ నీ పాదకమల చిహ్న
ములను ముద్దిడుకొనుచు, యా మోక్షదాత
లయిన యవతారమయు లీల నరుగు తెరవు
బోయి శాంతి సౌధము జేర సాయపడుము

**(శాంతి సెప్టెంబరు 1954)**

❊ ❊ ❊

సీ. ప్రేమాస్పదుండవౌ ప్రియమైన నా ప్రభూ
నా వ్యక్తి భావన నా మనంబు
సంధ్యా సమయమున జలజబాంధవు డంత
రించెడిరీతిగ నంతరించుచుండె
పరమ పవిత్రమై ప్రాపంచకమునకు
మూలమౌ నీ నామమును మదీయ
హృదయ మను గుడిలో ముదముతో దలచెడి
సమయాన దైవీక చరితమందు
తే. ప్రబలమగు శక్తి నొసగుము వసుధ నేను
దానిచే పునీతుండనై జ్ఞానినగుచు
శాశ్వతంబగు కైవల్య సదనమందు
భూరి సుఖమును తృప్తిగా బొందగలను.

**(శాంతి అక్టోబరు 1954)**

❊ ❊ ❊

సీ. జీవకోటులకెల్ల జీవిత సంతోష
మావశ్యకము మన యట్లె యనుచు
దెలిసికొందుము గాక ! దీనిచే మేమెల్ల
పరిపూర్ణ కారుణ్య భావుల మయి
నిఖిల వస్తువుల మా నిర్మల శాంతి జీ
వితముల వలన ధన్యతను బొందు
నటు చేయుదుము గాక ! కష్ట మే ప్రాణికిన్
గలిగింపకుందుము గాక ! సతము
తే. ప్రేమకాంతి సంఘంబుతోవెలుగుచుండు
నీ యఖండ హృదయమందు నిఖిల జీవ
రాశి వారి దివ్య పదవారాశి నొంది
హాయిగా నుండులాగునన జేయు దేవ !

**(శాంతి నవంబరు 1954)**

❋ ❋ ❋

సీ. ఆనంద సచ్చాంతు లైక్యమై రూపంబు
దాల్చినవాడ ! ఓ దైవమా ! మ
హాశోక భూయిష్ఠ మగు నీ వసుధయను
పల్లవంబున నీవు బహు మధుర ఫల
వృక్ష జాలముతోడ విమల సలిలముల
తోడను సొంపుగా గూడియుండు
నందన వనమువై సుందర మౌ నీ వి
శుద్ధాత్మచే శాంతి సుఖము లబ్బ
తే. జేయుచుండెద వీ సర్వ జీవులకును,
నీ తనయులెల్ల నీ యందు నెమకి నెమకి
వారి విశ్రాంతి, నీలోనె బడయునటుల
పూర్ణమౌ నీదు సత్కృప పొందు గాక !

**(శాంతి డిశంబరు 1954)**

❋ ❋ ❋

సీ. ఆత్మరూపమా ! ప్రియమైన దేవా ! నీకు
జయము, ముక్తుడ వీవు సతము, జనన
మరణరహితుడవు, మఱియు నీ శాసన
మున కెన్నడు చలన మనగ లేదు
నిన్ను నమ్మిన వారి కెన్నటికిని నాశ
ముండదు సర్వదా యుంద్రు సౌఖ్య
పదమున వారలు, నిన్ను పదునైన కత్తులు
ఛేదింపనేరవు, శిఖయు కాల్ప
తే. జాల దెట్టి రజ్జువుల్ గట్టజాలకుండు,
భాను సన్నిధి చీకట్లు పాయునట్లు
ప్రేమ మయుడగు నీ ముందు భేద రూప
మైన దౌర్జన్య ముండదు హతము గాక !

**(శాంతి జనవరి 1955)**

❊ ❊ ❊

సీ. సర్వశక్తుండును సతము నా హృదయమం
దిర నివాసి యయిన దేవున కిల
నన్నుద్ధరించుట కెన్నాళ్ళొ పనిలేదు
ధీశక్తిచే నేను దెలిసికొనెడి
నిజము దైవమునందు నిండుగా నాధార
పడు మని ప్రోత్సాహపఱచుచుండె
సర్వనియంతయౌ సర్వేశ్వరుని సున్ని
తమగు యాజ్ఞల దలదాల్చియుంట
తే. చే మహోత్కృష్టమౌ మేలు జెందవచ్చు
సర్వ భద్రములు మఱియు సంభవించు
భూమవిద్యా ప్రదాయకా ! ప్రేమరూప !
తథ్యపథ మీవు నా కని తలచు దాన.

**(శాంతి ఫిబ్రవరి 1955)**

❊ ❊ ❊

సీ. ఓ దయాధిపతీ ! మహోన్నత నిర్మల
మగు నీదు ప్రేమాలయమునకు గల
ద్వారకవాటముల్ దయతోడ నా హృద
యమున తెరువుము శ్వేతాంబరులగు
భవదీయ నిత్య సేవకు లింతకుమునుపే
యందు గలరు వారి యమల జీవి
తములను పూవుల దండలు వాకిట
కనిపెట్టుకొని యుండ జనులకెల్ల
తే. భక్తి సహితమధుర సౌరభంబుల వెద
జల్లుచున్నవి వారల జయముదముల
రమ్య గీతము లాత్మకు సౌమ్యమైన
క్రొత్త యావేశ మిచ్చి యున్మత్తు జేయు.

**(శాంతి మార్చి 1955)**

* * *

ఓ కృపాధినాథా ! నీ పవిత్ర ప్రేమాలయ ద్వారకవాటముల నా హృదయమందు తెరువుము. శ్వేతాంబరులగు నీ నిత్య సేవకులు అదివరకే యిందున్నారు. వారి నిర్మల జీవిత పుష్పమాలికలు, ద్వారమున వేచియుండు వారికి భక్తి పూరితములగు మధుర సౌరభముల వెదజల్లు చున్నవి. జయ సంతోషమయములగు వారి సౌందర్య గీతా నాదములు యాత్మ కావేశము కల్గించి యున్మత్తత నొందించు చున్నవి. సర్వేశా! నేను నా నియమిత దోషములతోను, రిక్త హస్తములతోను నీ కడకు వచ్చినను హృదయ ద్వారముల బాహాటముగా తెరువుము.

హరిః ఓం తత్సత్

సీ. మన మనోలోకము ఘనముగ నెప్పుడు
దైవభావములచే దనరు గాక !
దైవేచ్ఛయె మన హృదయఫలకంబుల
వ్రాయబడి సతము వరలు గాక !
పావనమౌ యట్టి స్వర్ణాక్షరంబుల
సర్వదా మననంబు సలుపుకొనుచు
పరమేశ్వరుని వాంఛ నెరవేర్చు పనియందె
మెలగుచుందుము గాక ! తెలివితోడ

తే. ఘనముగా మనోవాక్కాయ కర్మములను
సల్పెదము గాక ! నిజమున సమయునట్లు
భగవదైక్యము సేయుచు భావరహిత
శక్తి ననుభవింతుము గాక ! సర్వ వేళ.

తే. అరయ నాధ్యాత్మికంబుగ నతని ప్రతిమ
లము ప్రతిమ లన నేల రూపము లనగదు
కాని రక్తమాంస సమూహమైన యస్థి
పంజరము కాము మోహమున్ బారదోల.

❊ ❊ ❊

ఓ పరమేశ్వరా ! నీ కృపచే మానవకోటి యంతయు ఏకమనస్కమై పరిపూర్ణ పవిత్రతను పొంది నిరంతరము శాంతి యందును, సత్యమునందును జీవించునటుల ప్రసాదింపుము.

ఓం ఓం ఓం

**(శాంతి సెప్టెంబరు 1956)**

❊ ❊ ❊

అంతట నిండియుండు మహా తేజస్వరూపమా ! వివిధ దేశముల యందలి నీ బిడ్డలు అనేక నామములతోడ పలు తెరంగుల నిన్నా రాధించు చున్నారు. పూజనీయమగు నీ తేజమును, ప్రేమ యును, ఐకమత్యమను పాశముచే మమ్మెల్లర బంధించుగాక !

నిన్ను నామరూపములు లేకయే సమస్త జీవుల హృదయము లందు నివశించుచున్నటుల భావించి యారాధించుటను మేమెల్లర మును సత్వరము నేర్చుకొనెదము గాక ! నీ సంకల్పము స్వర్గమందు వలెనే భూమియందు గూడ నెరవేరునుగాక !

శాంతి ప్రేమలను అగ్ని జ్వాలలయందుపడి నీచత్వము, స్వార్థ పరత్వము, అయోగ్యత దగ్ధమై నీ మహిమను వ్యక్తముగావించు పరిపూర్ణత్వమును, ఐకమత్యమును, బ్రహ్మానందమును ఒసంగును గాక !

ఓం ఓం ఓం

**(శాంతి జనవరి & ఫిబ్రవరి 1959)**

ఆత్మగతమై యుండి జీవితములకు మధుర ఫలంబుల నొసంగు నో పవిత్రమూర్తీ ! బ్రహ్మాండ మంతయు నిండియున్న తేజస్సు నుండి మనలో నిమిడియున్నప్రత్యేక తేజస్సును విడదీయు అహం అను అంధకారబంధురమైన మాయనుండి మేము విముక్తు లగుదుము గాక ! సత్య మనెడి గులాబీ పుష్పమునందిమిడియున్న పూదేనెను మేము నిశ్చలతతో ఏకాంతముగా మనసార నాస్వా దింతుము గాక !

నిశ్చలమై, నిరోధితమైన మా మనస్సు శాంతి, ప్రేమ, దయా పూరితమైన అపారమైన భావములతో నలుదిక్కులను వ్యాపించుగాక!

ఓం ఓం ఓం

**(శాంతి జూన్ & జూలై 1959)**

❊ ❊ ❊

దృశ్యప్రపంచ రూపమున నలరారుచుండు ఓ దివ్యతేజ స్వరూపా! మా మానసంబులను, పవిత్రమగు ఓంకారముపైని నిలుపు నటుల మమ్మాశీర్వదింపుము.

మేము పీల్చునట్టి ప్రతి శ్వాసతోడను దైవసంబంధమగు శక్తిని లోనికి తీసుకొనునట్లును, విడచిపెట్టు ప్రతి శ్వాసతోడను దౌర్బల్య మును, నైచ్యమును వదలివేయునట్లును భావించునట్లు మాకు తోడ్ప డుము. విశేషించి మేము నీ మంత్రాక్షరమగు ఓంకారము నుచ్చరించు నపుడు తేజఃపుంజములను, ప్రేమ వెల్లువలను, శాంతి ప్రవాహము లను మానవకోటి వైపునకు ప్రసరింపజేయునట్లు భావనజేయ నాశీర్వదింపుము. మేము నిన్ను ప్రార్థించునదెల్ల నిదియే.

ఓం ఓం ఓం

**(శాంతి ఆగస్టు 1959)**

## ఆశీర్వాద ప్రార్థన

ఓ రాజాధిరాజా ! నీకు అనంత ప్రణామములు. అనిశము అద్వైతానందమును గ్రోలుచు నీ దివ్య రూపమునందే నివసింతుము గాక !

మా నడవడికలను చక్కజేయుచు కార్యకరణముల శాసించుచు దుష్ట చెయ్యులనుంచిన్నీ దుర్మార్గములనుంచిన్నీ నివృత్తుల జేయుము.

అహర్నిశము నీ మహోత్కృష్టానందదాయిని యైనటువంటి నీ అస్థిత్వ ప్రభావ పుంజమున తేజసునిగా నొనర్చి రక్షింపుము.

భక్తి, జ్ఞాన వైరాగ్యముల పెంపొంద త్వదీయ దివ్య ధర్మముల శిరసావహించి అనుకరింతుముగాక !

నా మనోభావములు అనిశము నీ యందే కేంద్రీకరింపబడి భవదైక్యానందమును అనుభవించునట్లు ఆశీర్వదింపుము.

**(శాంతి సెప్టెంబరు 1959)**

* * *

ఓ మధుర ప్రేమమా ! ఏ నీవు ప్రకృతివలన గులుగు యవి రామక్లేశములను, భవభయాదులను నిర్మూలించుచుంటివో అట్టి నీ పవిత్ర ప్రేమ మాకనిశము చేదోడు వాదోడై విలసిల్లుగావుత.

ఓ అవ్యాజాద్వితీయ ప్రేమమా ! ఏ నీవు మా హృదయాంతరాళ ములనుండి చక్షురింద్రియముల పర్యంతము ప్రవహించుచుంటివో అట్టి నీ పరమోత్కృష్టమగు ప్రేమ మాయందు సదా నిలువనీడయై నొప్పు గావుత.

ఓ పరిపూర్ణ ప్రేమమా ! ఏ నీవు మా జీవితములను సఫలీకృత ములుగను పరిపూర్ణములుగ నొనర్చుచున్నదో అట్టి నీ యఖండ ప్రేమ, మా కార్యకరణముల కాధారమై నిత్యము అలరుగావుత.

ఓ అదృశ్య ప్రేమమా ! ఏ నిన్ను ప్రమత్తులముగాను నీ యం దుండి నిన్ననుకరించుచుంటిమో అట్టి ప్రేమ మాకు సదా మా జీవితములం దంతర్జనితమై నెగడుగావుత.

ఓ ప్రేమభావమా ! ఏ నీవు మమ్ములను పవిత్రములుగా నొనర్చి పోషించుచుంటివో అట్టి పరిపూర్ణ పావన ప్రేమ కెల్లపుడు సర్వత్ర అంతర్భూతమై ప్రకాశించుగావుత.

ఓం ఓం ఓం

**(శాంతి మే 1959)**

❊ ❊ ❊

ఎవ్వని మహిమాతిశయములను వేదములు వేనోళ్ళ బొగడుచున్నవో, ఎవ్వని శుద్ధ తత్వమును ఉపనిషత్తులు సదా యేకగ్రీవమున స్తుతించుచున్నవో, ఎవ్వని దివ్య స్వరూపమును సృష్టి ప్రత్యక్షముగ పొడచూపుచున్నదో, అట్టి ఓంకారాధ్యా ! ఆద్యంతరహితమై, అనంతమై పరగు నీ సూత్రమున నేనొక చిన్న పూసను, ఓ ప్రేమస్వరూపా! నే నిమీలిత నేత్రినై భవదీయ ప్రేమను, సుందరరూపమును తిలకించితినేని, సంతోష తరంగికలచే భవదీయ సన్నిధికే కొట్టుకొని పోవుచుందును. ఆహా ! అచ్చట భవదీయ ప్రేమయందును, ఆనందమందును, పారవశ్యత పొందుటే గాని వికలత్వము గానరాదు. కావున అదే రీతిని నీ హృదయమందు సదా నేను మునుంగుచుందునుగాక !

ఓం ఓం ఓం

**(శాంతి జనవరి & ఫిబ్రవరి 1960)**

❊ ❊ ❊

## పవిత్రమగు సాయం సంధ్యా ప్రార్థన

ప్రేమాస్పదుడవగు ప్రభువా ! నీయందు నా హృదయమును, మనసును, వ్యక్తిత్వమును వెలుగుచుండు సూర్యుడు సంధ్యా సమయమందువలె నంతరించుచున్నవి. పవిత్రమగు నట్టియు, సృష్టికారణమగు నట్టియు నీ నామమును నా హృదయమను దేవాలయమందు స్మరించునపుడు ఆధ్యాత్మిక జీవితమునందు ప్రబలమగు శక్తిని బ్రసాదింపుము. అందువలన నేను పునీతుడనై శాశ్వతమగు పరమగతి నొందగలను.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**(శాంతి ఏప్రిల్ 1960)**

❊ ❊ ❊

గ్రహణ శక్తిని బాగుగా గలుగజేసి
దైవమా ! మాకు బరిశుద్ధభావ మిడుమ !
నీమనః ప్రవిలాసిత ప్రేమ నెఱపి
మము దయామతులను జేయుమా మహాత్మ !
పరుల బాగునకై పాటుపడెడురీతి
సిద్ధశక్తి ప్రభావుల జేయుమయ్య !
అలతులౌ తోడివారిలో నలుసులెన్ను
చెడ్డబుద్ధికి మమ్మెడ జేయుమయ్య !
నీ విలాసంబె ప్రతిదానిలో వెలుంగు
చిత్రమును మమ్ము దిలకింప జేయుమయ్య !
నిత్య సద్వృత్తి సత్ప్రేమ నిర్మలాత్మ
తత్వగూఢత్వమును మమ్ము దలప నిమ్ము
ప్రాణములుగల్గి విలసిల్లు మానవునెడ
సర్వ పశుపక్షి మృగజల చరముల యెడ
అపరిమిత భూతదయ నహింసాభిమాన
మలర దయచేసి మము బ్రోవుమయ్య దేవ !

**(శాంతి ఆగస్టు 1960)**

* * *

ప్రేమ, హృత్ప్రేమ, సమరసప్రేమ, ప్రేమ;
జ్యోతి, హృద్ జ్యోతి, తత్పరంజ్యోతి, జ్యోతి;
మౌనమా మనోమౌనమే, మౌన మహహా;
శాంతి, హృత్ శాంతి, సర్వవిశ్రాంతి, శాంతి;
మేమనంత దివ్య ప్రభోధాములమయి
నెమ్మదిగ నిశ్చయంబుగా నిరుపమాన
నిశ్చలగంభీరమై మాదు నిర్మలాంత
రంగభాగంబులం దహరహము వెల్గు
నద్వితీయ పరబ్రహ్మమందు సరిగ
జేరుకొనుచున్న వారము సిద్ధులమయి
శుద్ధ పరిశుద్ధ ! పరిశుద్ధ ! బుద్ధదేవ.

ఓం ఓం ఓం

**(శాంతి సెప్టెంబరు 1960)**

❊ ❊ ❊

ఓ విశుద్ధ ! అవాఙ్మనోభావితైక్య
రూప ! ఆర్పరానట్టి మహాపరంప్ర
భాసమైక్య ప్రభావ సంభవముగ్ర
తేజమున బ్రజ్జ్వల న్మనోదీప్తి నలరు
వారిగా మమ్మొనర్పుమో పరమ పురుష
నీ నిరంతర వ్యాప్త శాంతి ప్రకాశ
భావరూప సాక్షాత్కారభాగ్య మందు
నట్లు పరిపూర్ణ కరుణానియంత వగుచు
మా మనోహృదయంబుల మా శరీర
ముల పవిత్రంబుచేయుమో పుణ్యనిలయ
ఓం సమస్తాత్మతేజః ప్రభో నమోస్తు.

ఓం ఓం ఓం

**(శాంతి డిశంబరు 1960)**

నా చిన్ని హృదయమందును, ప్రచండ వేగమున తిరుగాడు బ్రహ్మాండగోళములందును వసించు ఓ ! ప్రియమైన లీలామానుష రూపా ! అనంతమై, అపారమై, చిత్రవిచిత్ర రూపములతో వెలయు భవదీయ ప్రేమ బిందువులను మెల్ల మెల్లగా ప్రతినిత్యము సంగ్ర హించు శక్తిని నా కుపదేశింపుము.

ఓ తండ్రీ ! ఎప్పుడో యే నిమిషమందో మెరపుతీగవలె క్షణ కాలము నీ యందు పారవశ్యము నొందుటేగాక, ఏకమై పూర్ణమై అద్వితీయమై నీలో అంతటను ఐక్యమై శాశ్వతానందమును చూర గొనుటయే మదీయ కోరిక, మదీయ జన్మసాఫల్యత.

ఓం ఓం ఓం

**(శాంతి మే & జూన్ 1962)**

❊ ❊ ❊

భగవంతుని అనుగ్రహము మనలను మహోన్నత నిశ్చల జ్ఞాన సంపన్నుల జేయుగాక !

యదార్థజీవనమును శాంత జీవనమును గడుపుటయందు మన మందరమును ఏకమనస్కుల మగుదుము గాక !

భగవంతుని అపార కరుణా ప్రకాశము మనపై ప్రసరించుగాక!

ఆదివ్యతేజోప్రభావ మహిమ మనలను పరిపూర్ణులజేయుగాక!

ఓం ఓం ఓం

**(శాంతి ఫిబ్రవరి 1962)**

❊ ❊ ❊

## క్రిష్టమస్ ప్రార్థన

ఓ సర్వాంతర్యామియు, శాంతమూర్తివియు నగు క్రీస్తు ప్రభూ! మార్పులులేని, దివ్యప్రేమమయ, జ్యోతి రూప, ధన్యజీవితమైన నీదు అమృతత్వమున మేము సదా నివసింతుము గాక !

అంధకారము యావత్ప్రపంచమును ఆవరింప, తేజోరూపమైన నీదు ఆత్యంతిక శాంతిలో మేము లీనమగుదుముగాక !

సకల చరాచరములు నీ శాంతి రాజ్యమును చేరుగాక !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ఓం తత్సత్ ఓం

**(శాంతి డిశంబరు 1962)**

* * *

ఓ దైవమా ! నా హృదయమును ప్రతీ క్షణము నందును నీ కొరకే స్పందించనిమ్ము ! నా శ్వాసను, ప్రతీ ఉచ్ఛ్వాస నిశ్శ్వాసను నీవైపే ప్రవహింపజేయుము. నాచేతి నాడిని గూడ నీ కొరకే కొట్టుకొననిమ్ము. నా నాడులలోని రక్తమును గూడ నీ కొరకే ప్రవహింప జేయుము. ఈ వాక్కు నిన్ను గురించియే మాట్లాడుగాక!

ఈ నేత్రములు నిన్నే దర్శించుగాక !

ఈ మనస్సు నీ ధ్యానమే నిరంతరము జేయుగాక !

ఈ బుద్ధి నీ ప్రేమ సముద్రములో విలీనమగుగాక !

ఈ అహంకారము "నేను, నాది" అనెడిది, కోటిసూర్యుల, నీ అఖండ తేజస్సులో దహింపబడు గాక.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**(శాంతి ఏప్రిల్ 1964)**

# ధ్యానము

ముక్త జీవులు నిర్యాణము చెందునట్లు ప్రాత సంవత్సరము క్రొత్త సంవత్సరము లోనికి ప్రవేశించు చున్నది. సౌందర్యమును ప్రసాదించు ఓ జగన్నిర్మాతా ! మారిపోవుచున్న నీ రాజ్యమును మా హృదయాంతరాళముల నుండి ప్రశాంతముగా గమనించుచున్నాము. తన్మయత్వమునందలి ఆనంద తరంగములలో, అనంతమున మున్గి తేలుచు నీ చిరునగవులనే గమనించు చున్నాము. ఓ నిర్వాణ సముద్రమా ! జీవనదులు నీ యందు అంతర్ధానమును పొందునుగాక !

ఓం ఓం ఓం

❊ ❊ ❊

ఆత్మ స్వరూపుడవగు ప్రియమైన దేవా ! నీకు జయము. నీవు నిత్య ముక్తుడవు. జననమరణ రహితుడవు. నీ శాసనమునకు ఎన్నటికిని చలనము లేదు. నిన్ను నమ్మిన వారికి ఎన్నటికిని నాశనము లేదు. అట్టివారే శాశ్వతముగా సుఖించెదరు. నిన్ను శస్త్రములు భేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. ఎట్టి పాశములును బంధింపనేరవు. సూర్యోదయము ఎదుట చీకటి నిలువ జాలక పటాపంచలగునటుల ప్రేమ స్వరూపుడవగు నీ యెదుట దౌర్జన్యము పొడచూపనేరదు. ప్రేమావతారుడవగు నీ చరితము స్తవనీయము. నేను సదా నీయందే మనసును నిలిపి నిన్నే ధ్యానించుచు ఉండునటుల అనుగ్రహింపుము. దేవా నమస్తే ! నమస్తే ! నమః !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

❊ ❊ ❊

ఓ తేజోమయా ! నేను అగాధ ప్రేమవనములో చొరగొనుటకు నవీన జీవితోదయమున నాలో వసింపుము.

సర్వకాలములయందుండు పుష్పములు పరిమితము నా శరీరమును ఆరోగ్యముతోను, నా ఆత్మను ప్రాణశక్తితోను నింపుగాక !

మృదుమధుర గానము చేయు పక్షుల యొక్క సహజ సంతోషముతోను, పరమానందముతోను నా హృదయమును నింపుము.

నీ యొక్క మధురామృత బిందువులవల్ల కలిగిన నిర్మల ధారలు తనివితీరని నా దాహమును తీర్చుగాక !

సామాన్య అరుచ్యాహారమువల్ల తీరని ఆకలిని కల్పతరువు యొక్క మధుర పత్ర, ఫలములు పోగొట్టుగాక !

నేను ప్రేమవనము యొక్క నిర్మలచ్ఛాయలందు గ్రుమ్మరుచున్నపుడు నా యాత్మను నీ యందు పూర్ణముగ లగ్నమగునట్లునుగ్రహింపుము.

ఓ దివ్యమూర్తీ ! నా ఆత్మ నీలో ఐక్యమగునట్లు ప్రసాదింపుము.

ఓం ఓం ఓం

❊ ❊ ❊

నీ నిరంతర వ్యాప్త శాంతి ప్రకాశ
భావరూప సాక్షాత్కారభాగ్య మందు
నట్లు పరిపూర్ణ కరుణానియంత వగుచు
మా మనోహృదయంబుల మా శరీర
ముల బవిత్రంబుచేయుమో పుణ్య నిలయ
ఓం సమస్తాత్మతేజః ప్రభో నమోస్తు.

ఓ సచ్చిదానంద స్వరూపా !

నీ యొక్క మధురామృత బిందువుల వల్ల కలిగిన నిర్మల ధారలు తనివి తీరని నా దాహమును తీర్చుగాక.

నేను ప్రేమవనము యొక్క నిర్మలచ్ఛాయలందు గ్రుమ్మరుచున్న పుడు నా యాత్మను నీ యందు లగ్నమగునట్లు అనుగ్రహింపుము.

ఓ దివ్యమూర్తీ ! అచ్చట మన మిద్దరమును సదా నివసించు దము, ఓం శాంతి.

ఓం ఓం ఓం

❊ ❊ ❊

ఓ అనంతశక్తీ ! నీ సంకల్పమే సృష్టి. నీ వికల్పమే లయము, నీ ప్రేమయే శాసనము. నీ ప్రేమపాలనమునందు చండతరమైన మానవుని శాసనమేపాటిది! గనుక మానవుడిక సిగ్గును చెందును గాక! సూర్యుడును, చంద్రుడును, తారాకాగణములును నీ శాసన బద్ధులయ్యే గదా గగనమున వెలుంగుచున్నారు.

ఆహా ! అల్లదె సంజకెంజాయ చిత్రవిచిత్ర కాంతులతో యెట్లా నందమును గొల్పుచున్నది. ఈ ప్రతిభా రమణీయ కాంతుల నొసగు సూర్యుడును నీలోని తేజోరూపమే గదా !

తండ్రీ ! భవదీయమైన సృష్టియందు అనుక్షణము వేలకొలది మార్పులతో చిత్ర రూపమున వెలుగొందు ఆనందమును సదా నీయందె నన్ను చూడనిమ్ము. మాయాతీతమై అవాఙ్మానస గోచర మయిన తత్వమును నీదగు యీ చిన్న జీవాణువులకు తెలుసుకొను జ్ఞానమును ప్రసాదింతువు గాక ! ఓ కృపా నిధాన ! యీ సృష్టి తిల కించుటయే గాక నా ప్రాణమునకు ప్రాణమును, జీవమునకు జీవ మును అయి వెలుంగు నీ పూర్ణత్వమునందు నేనొక అణువును అను జ్ఞప్తిని అనుగ్రహింతువు గాక !

ఓం ఓం ఓం

❊ ❊ ❊

నేను నా యింద్రియ ద్వారముల నన్నిటిని బంధించి విషయ ప్రపంచమునుండి నివృత్తి జెందుటచే నా మనంబు ప్రశాంతత వహించి యున్నది. దైవ సన్నిధిచే గల్గు పవిత్రమగు శాంతిని నే నిప్పుడనభవించు చున్నాను.

నా యుచ్ఛ్వాస నిశ్వాసలు సమానముగా నుండుటచే నా శరీరము నందలి ప్రతి అణువు దైవసాన్నిధ్యముచే యానందము ననుభవించుచున్నది. దివ్యతేజమున బయలుదేరిన యలలు సంపూర్ణ మగు శాంతి గర్భములోనికి నన్ను గొంపోవుచున్నవి.

❊ ❊ ❊

సత్తామాత్రుడవును, సర్వవ్యాపకుడవును అగు ప్రేమమయా ! నన్ననుగ్రహింపుము. నామరూపాత్మకములగు సమస్త చిహ్నములను, ఛాయలను నేనిప్పట్టున త్యజింప గోరుచున్నాను. యేలనన, ఓ హృద యేశ్వరా ! నన్నవి ప్రకాశాత్మకమగు నీ పాదసన్నిధి జేర్చి మన మధ్య నెట్టి యడ్డంకియు లేకుండ నొనర్చి నీ మహిమను జక్కగా గోచరింపజేసినవి. నామరూపముల వీడకున్న శాశ్వత జీవనమును, ప్రకాశవంతమును అగు నీ దివ్యరూపము కానరాదు.

ఓ దివ్య తేజస్వరూప ! నీవు నా యందు ప్రకాశించి యందలి యజ్ఞానంధకారమును బారద్రోలుము. నీ ప్రేమతో నన్ను ముంచివైచి నీ వియోగ దుఃఖమును నే నెన్నడును అనుభవింపకుండునట్లొ నర్పుము. ఓ మహాదేవా ! నా సర్వస్వమును నీవే యని తెలిసికొం టిని. ముక్తిప్రదా ! నాకు నీకై దండ నొసంగి పవిత్రమగు నీలో నన్ను జేర్చుకొనుము.

ఓం ! ఓం ! ఓం !

❊ ❊ ❊

పూర్ణముగ నీదు బంటునై పరగు కతన
నీ మహత్తె నన్నవనిలో ద్రిప్పుచుండు
దివ్యకాంతియె నాకు నాదర్శనమగును
తప్పుసేయను పడిపోను దారితప్ప;
చేసినట్టి పాపములకై చింతసేయ
దైవికవిధి వాని ఫలంబు ద్రోసివేయ
ఎఱుక లేమిచే చేసిన యఘచయంబు
మహిని చైతన్య మనియెడి మెట్లవరుస.
నిర్మలముగ నా హృదయాన నున్న ప్రేమ
జ్వాల, నిప్పు కాంచనమును శుద్ధిజేయు
నటుల శుద్ధిజేయును నా హృదయసీమ;
దైవబిడ్డగా నే భువి దనరుకతన
నందరిని గెల్చుకొందును; అవని యందు
త్యాగిగా నన్ను జపములు దలతు రేమొ
త్యాగి నే కాను నిజమును దఱచి చూడ,
ఏలనన నేను భ్రమయను నునికి బదులు
సత్య రత్నము భువిని నే వెదకు కతన.

❊ ❊ ❊

## ఆత్మార్పణము

నాదుమూకత్వమును భాషణప్రసక్తి
బలసమర్థత లమితదుర్బల విధంబు
లూహలను వాంఛితంబులు నింద్రియ ప్ర
చారములు కర్మములు మనోశయములనెడి
సకల సంకల్ప శక్తు లీ సమయమందు
బలిగ నర్పించుకొనుచు నే నిలచియుంటి
స్వీకరింపుమ యిప్డు లోకైకనాథ
నీదు దాసినెయగు నేను నీకు సేవ
హృద్యయముగ జేయుదు ననుగ్రహింపుమయ్య !
నిత్యమైన నిశ్చలంబగు నీదు ప్రేమ
యనెడి జ్యోతితో నింపబడ్డట్టి నేను
స్థిరముగా నీకు దివ్య మందిరము నొకటి
గట్టుటకు గొంత శిధిలమైనట్టి నీదు
పర్ణశాలను గ్రమ్మర బాగుచేయ
సాయమొనరింపగాదగు సాధనముగ
బిలువబడునట్లు చేయుమో విశ్వరూప !

ఓం ! ఓం ! ఓం !

❊ ❊ ❊

సుధాకరుని నిర్మల చంద్రిక గాంచి చంద్రకాంత పుష్పములు వికసించుటవలె మన మీ పవిత్ర సమయమున మన హృదయముల సర్వేశ్వరు నెదుట బహిర్ముఖము చేయుదము. అతని వైభవము మన కఠిన హృదయ మానసముల ప్రకాశించి వాటి నతని నిత్య ప్రేమచే నింపించును గాక !

మనకు బోలె జీవకోటి కంతటికిని జీవిత సంతోష మావశ్యక మని మనము గ్రహింతుము గాక ! అందుచే నస్మదీయుల దయా పరిపూర్ణుల కావించి ప్రతి వస్తువును మా నిర్మల శాంతి జీవితములచే ధన్యములగునట్లు తప్ప యపకృతి నొందునట్లు కావింపకుము.

ప్రేమ ప్రకాశముల వెలుంగుచుండు నీ యఖండ హృదయమున సర్వ జీవకోటియు వారి దివ్యపదము నొందుదురు గాక !

ఓం ! ఓం ! ఓం !

❊ ❊ ❊

మన మనో ప్రపంచము నిత్యము దైవిక భావములచే నలరు గావుత!

భగవదేచ్ఛయే మన హృదయ ఫలకముల లిఖింపబడి యుం డును గాక ! అట్టి స్వర్ణాక్షరముల మన మెల్లప్పుడు మననము చేయుచు భగవదోద్దేశ్యమును, భగవదేచ్ఛను నెరవేర్చుట యందే మిగుల జాగరూకులమై మెలంగుదముగాక ! సత్యమునందే అనిశము మన మనోవాక్కాయ కర్మలను కేంద్రీకృత మొనర్తుము గాక !

భగవదైక్యము చేసికొనుచు మనో బుద్ధీంద్రియములకు అతీతమగు శక్తిని అనుభవింతము గాక !

ఆధ్యాత్మికముగా మన మాయన ప్రతిమలము – ప్రతిమలేల? ఆయన స్వరూపులమే; కాని, రక్తమాంస శల్య సమూహమైనట్టి యీ అస్తిపంజరములు మనము కాము.

అఖండమైనట్టి, పరిపూర్ణమైనట్టి భగవంతుని యందు మన ఐక్యానుసంధానమును ధ్యానింతము గాక !

ఓం ! ఓం ! ఓం !

❊ ❊ ❊

అదిగో ! ఒక గొప్ప జీవనాధారము. అందుండియే ప్రకాశమై ప్రేమ తేజస్సు, జీవితములను ప్రవాహములు ఝల్లున ప్రవహించుచున్నవి.

మన మందరమును మనస్సాక్షిగా యిప్పుడే ఆ అమృత ప్రవాహమున స్నానమాడుదము గాక !

భగవంతుని యొక్క ప్రేమ వాహినియందే పవిత్రమైన శక్తిని మన మందరము పొందుదుము గాక !

అతని దివ్య ప్రేమయే మనలను చక్కని బిడ్డలనుగా చేయుచున్నది.

అతని ప్రకాశమానమైన నూతన జీవమే మన జీవితమందలి ప్రతి రక్తనాళమునందును కదలుచున్నది.

ఆ మహామహుని నుండి బహిర్గతమై ప్రవహించెడి జ్ఞానతేజమే మనలను అజ్ఞానము, ద్వైతము అను తప్పుదారుల పడనీయక సదా కాపాడుచున్నది.

ఆ భగవంతుని అనుగ్రహముచేతను, ప్రేమచేతను అతని పూర్ణ ప్రతి స్వరూపులమై మన మందరమును పూర్ణత్వము నొందిన వారలమే. ఎప్పుడో గాదు – ఇప్పుడే. అదియే – అతని మహిమ.

ఓం ! ఓం ! ఓం !

* * *

గాఢమగు ప్రేమచే నిండిన గూఢమగు నో దేవా !నీ యందలి విశ్వాసము ఎల్ల జనులకు వంశ పార్యంపరముగ విస్తరించుగాక! నీ యందలి దృఢనమ్మకమే మంచి చేయుటకై నిచ్చలు తల్లడిల్లుచున్న యీ నూతన యుగమునందు దుద్భవమైన బిడ్డలు భక్తి జ్ఞాన ప్రసాదిత ఫలమగు ముక్తిని వెదకుకొనుటకై శక్తినొసంగు గాక ! యుగయుగము నందును నీ యవతారములచే చాటబడిన సత్య సందేశపు వాక్కునే మా వీనులెప్పుడును వినుచుండుగాక! మేమెల్లరము మాయ నుండియు, ప్రపంచ వ్యామోహము నుండియు విముక్తులగునట్లను గ్రహించి మేము నిరంతరము ఆధ్యాత్మిక కృషినే సల్పుచు అశాశ్వతములగు నీ శరీరములకొరకై పాటుపడకుండునట్లు మమ్మాశీర్వదింపుము. శాంతిపూరితమగు నీ యొక్క సందర్శన భాగ్యముచే గల్గు శాశ్వత సుఖము నాస్వాదించుటకే ఎల్లప్పుడు మేము పాటుపడుదుము గాక! అణువు మొదలుకొని దేవతలవరకును గల యెల్ల జీవకోటి యొక్క పూజలు, సేవలు నీకు చేరుగాక!

ఓం ! ఓం ! ఓం !

❊ ❊ ❊

మధురమును, అనంతమును అగు నామములుగల ఓ ప్రభువా! నీ యాజ్ఞను నెరవేర్పగలుగు శక్తి కొరకు మా యాధ్యాత్మిక దృష్టిని నీవైపునకు నిగిడించుచున్నాము.

కోరిక లెవ్వియును నీ దివ్య చరణారవిందముల నుండి మమ్ముల నెడబాపకుండును గాక ! నీ యపార ప్రేమరసపూరముచే మమ్ము నింపెదవేని మేము బయలుదేరి ప్రపంచమునందెల్లడల మంగళ ప్రదమగు శాంతి సందేశమును వ్యాపింప జేసెదము.

సమస్త ప్రాణులను సత్వరముగ సమాధి, నిర్వాణము లేక దేవుని రాజ్యమును పొందును గాక !

ఓం ! ఓం ! ఓం !

❊ ❊ ❊

నేను నా యింద్రియ ద్వారములన్నిటిని బంధించి విషయ ప్రపంచము నుండి నివృత్తి జెందుటచే నా మనంబు ప్రశాంతత వహించి యున్నది. దైవసన్నిధిచే గల్గు పవిత్రమగు శాంతిని నేనిప్పు డనుభవించు చున్నాను.

నా యుచ్ఛ్వాస నిశ్వాసలు సమానముగా నుండుటచే నా శరీరము నందలి ప్రతి యణువును దైవసాన్నిధ్యము వలన యానందము ననుభవించు చున్నది. దివ్య తేజమున బయలుదేరిన యలలు సంపూర్ణమగు శాశ్వత గర్భములోనికి నన్ను గొంపోవు చున్నవి.

ఓం ! ఓం ! ఓం !

❊ ❊ ❊

నేను ధ్యానసమాధిలో నిలిచినపుడు
అద్వితీయైక సత్య పదార్థ మేదియొ
నాదు స్మృతి సర్వమున్ నాశనం బొనర్చు;
ఎఱుకమర్పులనెడి రెండు తెఱగులైన
యేటినీరు సరాసరి నెల్ల సృష్టి
లోన బ్రవహించు నూటకాలువను నొకటి
నా శరీరంబు కూర్చుచున్నది యదేమొ !
ఔర ! ఎంత చిదానందమయ్యె నహహ !
ఆ మహానంత దివ్య తేజోమహాత్మ
నన్ను నిండించి మఱియు నత్యున్నతమగు
సేవకొఱకు నన్ దొందుజేయునిదిగొ;
ఇపుడు నేను సాక్షాత్పరమేశువిద్యు
దుద్యదంశుడ సుమ్మన వద్యముగను;
సర్వపాప రుగ్జాలంబు సమసిపోయె;
శ్రీహరీ ! శ్రీహరీ ! శ్రీహరీ ! నమోస్తు !

ఓం ! ఓం ! ఓం !

❊ ❊ ❊

## భగవదైక్య ధ్యానము

మన మనోప్రపంచము నిత్యము దైవిక భావములచే నలరు గావుత !

భగవదేచ్ఛయే మన హృదయ ఫలకముల లిఖింపబడి యుండును గాక ! అట్టి స్వర్ణాక్షరముల మన మెల్లప్పుడు మననము చేయుచు భగవదోద్దేశ్యమును, భగవదేచ్ఛను నెరవేర్చుటయందే మిగుల జాగరూకులమై మెలంగుదుము గాక ! సత్యమునందే అనిశము మన మనోవాక్కాయ కర్మలను కేంద్రీకృత మొనర్తుము గాక !

భగవదైక్యము చేసికొనుచు మనోబుద్ధీంద్రియములకు అతీత మగు శక్తిని అనుభవింతుము గాక !

ఆధ్యాత్మికముగా మనమాయన ప్రతిమలము, ప్రతిమలేల ఆయన స్వరూపులమే. కాని రక్త మాంస శల్య సమూహమైనట్టి యీ అస్తి పంజరము మనము గాము.

అఖండమైనట్టి పరిపూర్ణమైనట్టి భగవంతుని యందలి మన ఐక్యానుసంధానమును ధ్యానింతుము గాక !

ఓం ! ఓం ! ఓం !

❊ ❊ ❊

## సత్యాన్వేషణము

సర్వశక్తుడును, నా హృదయ నివాసియును నగు దైవమునకు నన్నుద్ధరించుటకు ఎంతయో కాలము అవసరములేదు. నా బుద్ధి చేతను నేను గ్రహించు సత్యము దైవమునందు పూర్తిగా నాధారపడ మని నన్ను ప్రోత్సహించుచున్నది. జగన్నియంతయగు పరమేశ్వరుని సున్నితమగు నాజ్ఞలను మన్నించుటచే సర్వోత్కృష్టమగు మేలును, సమస్త శుభములును చేకూరగలవు. ప్రేమ స్వరూపా! నీవే సత్యమార్గ మవై యున్నావు.

ఓం ! ఓం ! ఓం !

❉ ❉ ❉

ఓ ప్రభువా ! నీ యమూల్యమగు ప్రేమయును, అనుగ్రహమును అను నమృతబిందువులు బ్రహ్మమయమగు నాణిముత్యముల సొంప లరార జల్లగా వర్షించు పట్టున నీ హృదయ కమలము వికసించి తేజోవిశిష్టమును, అనుగ్రహరూపమును అగు వర్షబిందువులను గ్రహించునుగాక ! నీ యాజ్ఞాపాలన మొనర్చుచు ప్రపంచ సంబంధ మగు గొడవలయందు సహితము నివాతదీపకళికవోలె నిశ్చల మానసమూని యుండుటకంటె నెక్కుడు సౌఖ్యమును గోరుటలేదు. ఓనిర్వాణ స్వరూపా! ఓ పావననామా! నీవు నిరంతర సౌరంభమును వెదజల్లు సుమనంబును, నిరంతరము బ్రవహించు నమృత వాహినివి అయి యున్నావు.

ఓం ! ఓం ! ఓం !

❉ ❉ ❉

దైవము యొక్క అపరావతరమగునో “శాంతీ” సంసార సముద్ర మునందలి కెరటములచే గొట్టుకొనిపోక నీ స్వస్థానమునందు నిలచి శాంతి ప్రేమలను గ్రోలుము.

నీవు ప్రార్థన గావించునపుడు ప్రేమాస్పదుడగు దైవమును అంతర్ద ృష్టితోడ వీక్షింపుము. దైవము నీ కోరికలకనువగు నందన వనమునకు నిన్ను గొంపోవ నీ యందే వేచియున్నాడు.

గాఢముగను, క్రమముగను, ఊపిరిగుండా శాంతిని లోనికి బీల్చుము, బయటకు విడువుము. నిన్ను మనోహరమగు తావునకు తీసికొని పోయి తన హస్తముతో ఆత్మోద్ధారకమగు నమృతమును, పానముగావింప నాతడు వేచియున్నాడు. దైవము యొక్క సన్నిధి సౌఖ్యము ననుభవింపుము. అతడు నీ యందే యున్నాడు.

రహస్యమగునట్టియు, భక్తి సులభమగునట్టియు ఆనందమును, నీ అంతర్ద ృష్టితో చూడుము; నీ అంతఃశ్రవణముతో వినుము. నీ అంతర్‌జిహ్వాతో రుచిగొనుము.

ప్రేమ, జ్ఞానము, మహిమ, శాంతి మొదలగునవి యెల్లనుదైవ లక్షణములు, వానిని నీవెల్లవిధముల నభ్యసింపుము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* * *

సముద్రపుటలలనుండి ఉదయ సంధ్యారాగము వెల్లివిరిసియు చున్న నేటి ఉదయము మన ఆలోచనలన్నియు పురాతన గెలైలీను అయినటువంటి, ఈ రోజుననే జన్మించి మానవులందరకు ఆత్యంతిక శాంతి మార్గమును జూపిన క్రీస్తు ప్రభువు గురించి యుండుగాక!

ఆ ప్రభువు చూపిన మార్గము సూటియై, శక్తివంతమై, దివ్యమైన స్వర్గద్వారమును జేర్చుగాక ! ఉదయమే గొప్పదిగాను కాంతివంతము గాను కనిపించు నక్షత్రము మన హృదయములను తేజస్సుతోను, శాంతితోను నింపుగాక ! ఆ ప్రభుని మధురశాంతి తేజోమయమై, యుద్ధభయోత్పాతములన్నిటిని అరిగట్టుగాక !

సాయం సంధ్య రాకపూర్వమే, ధన్యమైన నేటి దినమున మానవు లందరును ఆ తేజోమయ మార్గమును గుర్తింతురు గాక ! ఈ క్రిస్టమస్ శుభ సమయమున మనమందరమును నిత్యశాంతి ప్రేమలతోనిండి, ఇతరులను గూడ ఆ మార్గముననే నడుపుటకు కావలసిన శక్తి సామర్థ్యములను ప్రసాదింపుమని క్రీస్తు ప్రభువును ధ్యానింతుము గాక !

సర్వేజనా స్సుఖినోభవంతు.

❊ ❊ ❊

ఎవ్వని మహిమాతిశయములను వేదములు వేనోళ్ళ బొగడుచున్నవో, ఎవ్వని శుద్ధతత్త్వమును ఉపనిషత్తులు సదా ఏకగ్రీవమున స్తుతించుచున్నవో, ఎవ్వని దివ్యస్వరూపమును సృష్టి ప్రత్యక్షముగ ఎొడచూపుచున్నదో, అట్టి ఓంకారాధ్యా ! ఆద్యంతరహితమై, అనంతమైన నీ సూత్రమున నేనొక చిన్ని పూసను, ఓ ప్రేమ స్వరూపా ! నేను నిమీలిత నేత్రినై భవదీయ ప్రేమను, సుందర రూపమును తిలకించితినేని, సంతోష తరంగికలచే భవదీయ సన్నిధికే కొట్టుకొని పోవుచుందును. ఆహా ! అచ్చుట భవదీయ ప్రేమయందును, ఆనందమందును, పారవశ్యత పొందుటేగాని వికలత్వము గానరాదు. కావున అదే రీతిని నీ హృదయమందు సదా నేను మునుంగుచుందునుగాక!

హరిః ఓం తత్ సత్

❊ ❊ ❊

## శుభాకాంక్షలు

వేలమైళ్ల దూరాన వెలసియున్న
పూజ్య గురువుల పుట్టినరోజు సంబరముకు
పంపుచున్నాను కృతజ్ఞతాంజలిదిగో

మైలుమైలునకొక మహత్తర భావపంక్తి
మసలు మనమధ్య సతము; గురువరా !
తనువుమరచి తమ సాన్నిధ్యమందు
కొలువుచేసి బోధలందిన ఘడియలు
కళ్లకు కట్టునిపుడు,
సంద్రముల్, దేశముల్ మనమధ్య కలవుగాన
తనువులు వేరుగాని, తలపులొక్కటే;
ఎల్లవేళల హృదయాలు ఏకమై యుండుకతన.

**–ప్రగాఢ భక్తి విశ్వాసాలతో సుశీల**

❊ ❊ ❊

## విశ్వ జనీనమగు మన స్వగృహము

స్వాగతం బిదె । సుస్వాగతంబు
శాంతి ప్రేమల । నిలయము శాంతి
ఆశ్రధామ । మిల దర్శించి
విశ్ర మింపను । తపము సలుపను
అందునెలకొను । శాంతి నొందును ॥స్వా॥
దాని తలుపు ల । వె తెరచి యుండెను
చోటుగల దం । దరికి నందున్
పిన్న పెద్దల । శాంతికాముల నిట
కోరి పిల్తుము । ఆదరింతుము ॥స్వా॥
కుసుమ భరితము । లందు తోటలు
ఆగు డా పరి । మిళము లందన్
నేత్ర పర్వము । చేయు పరిసర
గిరుల పంక్తులు । ముదము గొల్పెడి
పక్షిరుతములు । గాలి నిండును
శాంతి నెలకొను । అట్టి తావుల ॥స్వా॥
జ్ఞాన ధనులును । సాధు పురుషులు
నిల్తు రందున్ । బెద్ద కాలము
మూఢు డేనియు । మౌని యగుట
వారి బోధల । వినగ నోచిన ॥స్వా॥
రహిని చేరెడు । శాంత్యాశ్రమము
విశ్వ జనీన । మగు ధామమున్
దవ్వుల । దగ్గిరంగల హితులు
చేరగ తెరచి । యున్న వదిగో
దాని తలుపులు । గాంచు మిత్రమ ॥స్వా॥

❊ ❊ ❊

## సోదరి సుశీలాదేవి – ఒక పరిచయం

సోదరి సుశీలాదేవి అమెరికా న్యూజెర్సీ రాష్ట్రంలో మిస్ ఎలెన్ సెయింట్ క్లేయర్ నొవాల్ట్‌గా జన్మించారు. వైద్య సేవలందించే నర్సుగా శిక్షణ పొందారు. కడకు ఆమె తనవారిని, రక్తసంబంధీకులను, తనకున్న యావత్ సంపదను త్యాగంచేసి స్వామిఓంకార్ ఆశయాలను అనుసరిస్తూ శాంతి ఆశ్రమ సేవకు అంకితమై సుదూరంలోని భారతదేశానికి వచ్చారు. వచ్చిన మొదటి నుండీ కూడా అమెరికాలోనూ, మాతృఆశ్రమానికి అన్ని విధాలా సేవలందించారు.

మూగ జంతువుల సేవ మొదలుకొని ఆశ్రమవాసులైన అనారోగ్య వంతులకు, గ్రామాలలోని పేదవారికి సర్వం తానే అయి సుమారు 25 సం॥లు సేవ చేశారు.

ఆమె జంతుప్రపంచానికి చేసే సేవల నుద్దేశించి స్వామీజీ, కొంచెం వింతగానే కన్పించవచ్చు, కాని ఈ మూగజీవులు–పిల్లులు, కుక్కలు, ఆమెతో సంభాషిస్తూ తమ ఆనందాన్ని బాధల్ని పంచుకునేవి. వాటి ఇబ్బందులని గ్రహించి అవసరమైన ప్రత్యేకశ్రద్ధ తీసుకొనేది. కొన్ని సందర్భాలలో వాటి కన్నీటిని తుడవడం, చీముకారే వాటి పుండ్లను పరిశుభ్రంగా వేడినీటితోను, కార్బాలిక్ సబ్బుతోనూ కడగడం చేసేది. దప్పికగా ఉన్నా, ఆకలేసినా, ఒంట్లో బాగాలేకపోయినా, ఆరోగ్యంగా ఉన్నా సరే ఆమెవద్దకు వచ్చి సేద తీర్చుకునేవి. సుశీలాదేవి ఎల్లప్పుడూ చిరునవ్వుతో ఈ నిస్సహాయ ప్రాణులకి అధిక శ్రమతో రాత్రింబవళ్లు వానిలో దివ్యచైతన్యాన్ని గుర్తించి సేవలందించేది.

నిస్వార్థమైన అనంతమైన ఆమె ప్రేమకు హృదయాన్ని స్పందింపచేసే సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఒకసారి అత్యంత ప్రమాదభరితమైన అంటు వ్యాధిసోకిన ఆవుదూడ అర్ధరాత్రి ఆమె గుమ్మంవద్దకు వచ్చి సేవలు పొందింది. ఆమె ఎడ్లబండిపైన, గుర్రపుబండిలోనూ ప్రయాణించడం మానివేశారు. ఆ

జంతువులను కొరడాతో కొట్టడాన్ని ఆమె భరించలేకపోయారు. ఒకసారి ఆమె ప్రేమగా చూచే పెంపుడు కుక్క 'రామీ'ని చిరుతపులి గాయపరచినది. సుశీలాదేవి 'రామీ'ని ప్రేమతో తెల్లవార్లూ మెలుకువగా ఉండి సేవలుచేసి రక్షించి మామూలుస్థితికి తెచ్చింది. అనేక సందర్భాల్లో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అనారోగ్యం పాలైనపుడు విసుగు చెందకుండా అవసరమైతే రాత్రంతా మెలకువగా ఉండి సేవలు చేసేది. గ్రామస్థులు ఆమెను కరుణామూర్తిగానూ, మూర్తీభవించిన ప్రేమదేవతగానూ గౌరవించడంలో ఏమాత్రం ఆశ్చర్యపడ నవసరంలేదు.

సుశీల విశాలహృదయం గల్గి జంతువులకి, రోగులకి సేవలందించే నర్సు మాత్రమేకాదు. ఆమెకు ఆశ్రమం సర్వస్వమైనది. ఆమె క్లర్కుగాను, స్టెనోగ్రాఫర్‌గాను వ్యవహరించి దేశ, విదేశాలకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేది. అమెరికా, యూరప్‌ల నుండి భక్తులు వచ్చినపుడు వారికి వంటలు వండి ఒక సేవకురాలిగా సేవలందించేది. కొంతకాలం ఆమె ఆశ్రమ కార్యదర్శిగాను, ఉపాధ్యక్షురాలుగాను ఉండి ఆశ్రమాన్ని దర్శించడానికి వచ్చే భక్తులను సాదరంగా ఆహ్వానించి వారికి అవసరమైన సేవలు నిశ్శబ్దకార్యకర్తగా అందించేది. ఇచట సాధకులకు ఒక చక్కని మార్గదర్శిగాను, జ్ఞానులకు శిష్యురాలుగాను వ్యవహరించేది. అనంత ప్రేమ అనే కేంద్రానికి అనేక మందిని ఆకర్షించగలిగేది. స్వామీజీ మాటల్లో "ఆమె ఒకసారి విజ్ఞులైన ఒక పెద్ద సభలో అందరినీ తమ నామరూపాలు మరచిపోయేలా చేయగల్గింది. దైవానుభూతిని పొందిన ప్రతీవారు మధురానుభూతితో కళ్ళనుండి నీళ్ళు కారుతూ తమ భౌతిక మనుగడనే మరచిపోయారు. అదో మహాద్భుతమైన దివ్యక్షణం. నిశ్శబ్దం, పూర్తిశాంతితో నిండిపోయిన ఒక దివ్యమైన అమృత నిశ్శబ్దం రాజ్యమేలింది. చాలాసేపటివరకు ఎవరు మాటామంతీ లేకుండా నిశ్చలంగా ఉండిపోయారు. బాగా రాత్రి అయినందువల్ల మామూలు వీడ్కోలు

వాక్యాలు కూడా లేకుండా ఎవరికి వారే నిశ్శబ్దంగా నిష్క్రమించారు. అంతా ప్రశాంతత-గాఢమైన ప్రశాంతత నిశ్శబ్దం. ఆ మధురానుభూతి, నిశ్చల నిశ్శబ్దంతో కూడిన ప్రేమమయ ప్రశాంతత నాకే కాదు ఆ రోజు ఆ సభకి వచ్చిన అందరిలోను జ్ఞాపకముండి చెరగని ముద్రగా మిగిలిపోయింది."

ఎంతో శ్రమపడుతూ ఇచట అనేక కష్టాలు పడుతూ ఆ కాలంలో మిషనరీలు కూడా చేయలేని పనులని సుశీలాదేవి క్రీస్తు అడుగుజాడలలో నిర్విరామమైన సాధారణ జీవితాన్ని గడుపుతూనే సాధించగలిగింది. అత్యంత ఆచార సాంప్రదాయులై ఉన్నత స్థాయిలో వారు కూడా తమ పూజామందిరా లలోకి, గర్భాలయంలోకి ఆమెను ఆహ్వానించేవారు. నన్నుమరింత ఆశ్చర్యానికి గురిచేసి నా హృదయాన్ని తట్టిన అంశం దైవాశీస్సులు పొందిన కొందరు మహనీయులు ఆమెలో తమ ఆరాధనా దైవాన్ని దర్శించగలిగారు. సత్యాన్ని దర్శించడం, నిర్గుణ నిరాకార సత్యాన్ని విశ్వప్రేమ ద్వారా దర్శించడం కన్నా మిన్న అయినది ఏముంటుంది! ఖచ్చితంగా ఎచట ప్రేమ ఉంటుందో అచటనే దైవముండును.

వాల్తేరు ఆశ్రమంలో శాంతి ఆరోగ్య శిబిరం ఏర్పర్చినపుడు స్వామీజీ "మన అదృష్టవశాత్తు న్యూయార్క్‌లో శిక్షణపొంది అర్హత గల్గిన నర్సుగా నిస్వార్థసేవలనందించే మన సుశీల ఆదర్శ జీవితాన్ని గడిపిన మిస్ ఫ్లారెన్స్ నైటింగేల్‌ని స్ఫురణకు తెస్తుంది. నిస్సహాయులు, అమాయకులు, పేదవారైన బెస్తవారికి ప్రేమ, దయ, నిస్వార్థత, త్యాగబుద్ధితో వారిలో అనారోగ్యంపాలైన వారికి ఆమె సేవలందించగలదు. నిస్సహాయులై పేదరికంతో మగ్గే ఆ బెస్త వారు డజన్లలో గాక వందలకొద్దీ రోగులు తమ ఇంటివద్దనే అత్యంత ప్రము ఖులు, నిపుణులు అయిన వైద్యులు సేవాభావంతో చేసే సేవలు పొందగలి గారు. పరిధులులేని తన వాత్సల్యంతో సుశీల వారికి మందులిచ్చి సేవ

చేయడమే గాక ఆహారము, దుస్తులు కూడా సమకూర్చేది. నిస్వార్థసేవకు ఆమె ఎంతగా అంకితమైదంటే చికిత్స సమయం ముగిసిపోయినా నిర్విరామంగా రాత్రయినా మందులిస్తూ తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచెయ్యక తన శక్తి సామర్థ్యాలనీ, కాలాన్నీ తనవద్ద నున్న సొమ్మునీ వాల్తేరు నుండి చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వచ్చే వారికొరకూ వెచ్చించేది. కుష్టువ్యాధిగ్రస్తుల పుండ్లను కూడా ఒక్కోసారి చేతికి రబ్బరు తొడుగుకూడా లేకుండా ఆమె శుశ్రూషపరచేది. కొందరు వైద్యులు అందుకు ఆమెను హెచ్చరించినపుడు ఆమె "దైవాజ్ఞలేనిదే గడ్డిపోచైనా కదలదు. నన్ను సాధనంగా చేసుకొని ఆ దైవమే సేవ చేయునపుడు అతడే నా నిస్వార్థసేవ గుర్తించి జాగ్రత్త తీసుకొనును" అనేది.

అత్యంత విషాదకరమైన దేమిటంటే సోదరి సుశీల దివ్యాత్మ 14 నవంబరు 1957న భౌతిక శరీరాన్ని విడిచి స్వర్గస్తురాలైంది. భారతదేశంలోని అనేక మంది ఆశ్రమవాసులకిది తట్టుకోలేని విషాదమైంది. ఆమె తన వ్యాధిగ్రస్తురా లైన తల్లికి సేవచేస్తూ అమెరికాలో ఉన్నది. అనేకసార్లు భారతదేశానికి రావా లని ప్రయత్నం చేసినా ఆమె ఇంట్లోని వారికెవరికో ఒకరికి అనారోగ్యం కల్గడంచేత రాలేకపోవడం జరిగింది. చివరకు ఆమె పూర్తిగానూ దృఢంగానూ నిశ్చయించుకొని 'వీసా' కాగితాలు కూడా పూర్తి చేసుకుని ప్రయాణమయ్యారు. చివరికి 13 నవంబరు 1957న తాను వస్తున్నట్టుగా జాబుకూడా వ్రాశారు. ఆ మర్నాడే తన సోదరునితో కలసి న్యూయార్క్‌లో ఒక సమావేశానికి హాజరై న్యూజెర్సీలోని తన ఇంటికి కారులో వస్తూ పెద్ద ప్రమాదానికి గురై మరణించడం జరిగింది. శాంతి ఆశ్రమానికి, భారతదేశానికి కూడా అది భర్తీ చేయలేని నష్టమే.

ఆమె స్మృతిగా స్వామీజీ "ఆధ్యాత్మిక జగత్తులో స్వామిరామతీర్థ ముఖ్య శిష్యుడైన స్వామి నారాయణ్, న్యూయార్క్‌లోని రామకృష్ణామిషన్ స్వామి

బోధానంద్‌జీ, యోగదాసత్‌సంగ్ స్వామి యోగానంద్‌జీ, దివ్య జీవన సంఘ స్థాపకులు శ్రీ స్వామి శివానంద మహారాజ్, ఆనందాశ్రమ శ్రీరామదాస్‌జీ ఉపనిషత్ విహార్ స్వామి రాజేశ్వరానంద్‌జీ మహరాజ్, మున్నగు అనేకమంది యోగులు, మహనీయులు ఆమె నిస్వార్థసేవలను, అంకిత భావాన్నీ విశ్వప్రేమను కొనియాడారు.

సోదరి సుశీలాదేవి మరణం తర్వాత, ఆమెలేని లోటుకు స్వామీజీ అంటారు– శుకదేవుడు తన గృహాన్నివిడిచి దీర్ఘతపస్సుకై అడవులకు వెలుతుంటే అతని తండ్రి అయిన వ్యాసుడు కుమారుని వియోగం భరించలేక "శుకా శుకా, శుకా" అని పిలుస్తుంటే కొండలు, వనంలోని వృక్షాలు పొదలు కూడా స్పందించాయి. ఎందుకంటే శుకుడు కేవలం ఒక శరీరానికే పరిమితమైనవాడు కాదు. అతడు విశ్వమంతా వ్యాపించిన, అన్నింటికీచెందిన, తనే అంతాఅయిన విశ్వప్రేమతత్వము. అదేవిధంగా సోదరి సుశీల మరణం తర్వాత ఆమెను తలచుకొని శాంతి ఆశ్రమంలో ప్రకృతంతా ప్రతిస్పందిస్తోం దని స్వామి ఓంకార్ అంటారు.

ఆమె ప్రేమ సజీవంగా మన స్మృతి పథంలో ఉండడానికి శాంతి ఆశ్రమ మొబైల్ మెడికల్ యూనిట్‌కు "సుశీల పీస్‌వాన్" అని వైద్యశాలకు "సుశీల వైద్యశాల" అని పేరు పెట్టారు. తోటపల్లి కొండలు, సమీప గ్రామ పేదప్రజలకు ఈ వైద్యశాల తగిన సేవలందిస్తోంది.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

❊ ❊ ❊

# శాంతిని పొందదలచిన సాధకులకు

# స్వాగతం పలుకుతోంది

# శ్రీ శాంతి ఆశ్రమము

అత్యంత రమణీయమైన ప్రకృతి దృశ్యములతో
శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామివారి తపశ్శక్తితో
అతి ప్రశాంతమైన వాతావరణములో          శ్రీ శాంతి ఆశ్రమము

శాంతి మార్గములో పయనించదలచిన వారికి
స్వాగతం పలుకుంది
సాధు, సజ్జనులకు,బీద బాలలకు, నిస్సహాయ వృద్ధులకు
భోజన భాజన విద్యావైద్య సదుపాయములు లభింపచేసి
వారి ఉన్నతికి తోడ్పడే          శ్రీ శాంతి ఆశ్రమము

శాంతిని పంచిపెట్టదలచిన నిస్వార్థసేవకులకు
స్వాగతం పలుకుతుంది.
హిందువులకు, ముస్లిములకు, క్రైస్తవులకు, బౌద్ధులకు
ఇంకా అన్ని ఇతర మతముల వారికి కూడా
వారి వారి విశ్వాసములకు, సిద్ధాంతములకు
భంగము కలుగని రీతిలో ప్రవర్తించే          శ్రీ శాంతి ఆశ్రమము